



గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, మాదాపూర్, హోటల్ నోవాటెల్, తాజ్‌డెక్కన్, బంజారాహిల్స్, వండల్‌లా, సిటీ శివార్లలోని రిసార్టులు, కన్వెన్షన్ సెంటర్లు తదితర ప్రాంతాల్లో న్యూఇయర్ ఈవెంట్లు జోష్ ఫుల్‌గా జరిగాయి. పలుచోట్ల ఈవెంట్స్‌లో టాప్ డీజేలు, సంగీతం, నృత్యాలు కేక పుట్టించింది. తారలు తళుక్కుమన్నారు. గేటెడ్ కమ్యూనిటీల్లో కుటుంబ సమేతంగా కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు. ట్యాంక్‌బండ్‌పై జనం సందడి చేశారు. కాగా అర్థరాత్రి వరకు హుస్సేన్‌సాగర్ చుట్టూ, ఎన్టీఆర్ మార్గ్ వైపు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించడంపై పలువురు వాహనదారులు నిరసన వ్యక్తం చేశారు.



హైదరాబాద్ వార్త

హ్యాపీ న్యూ ఇయర్ కేకలతో నగరం హోరెత్తిపోయింది. **2024** సంవత్సరానికి నగరవాసులు గ్రాండ్‌గా వెల్‌కం చెప్పారు. నగరవ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు ఫుల్ జోష్‌తో సాగాయి. ఆదివారం రాత్రి వరకు గ్రేటర్ వ్యాప్తంగా పలు ప్రాంతాలు.. జనాల కేరింతలు ..వేడుకలతో సందడిగా కనిపించాయి. న్యూ ఇయర్ ఎండ్‌కు వీకెండ్ కూడా కలిసి రావడంతో జనాలంతా ఉదయం నుంచే సెలబ్రేషన్స్ మొదలుపెట్టేశారు. దీంతో సిటీలోని టూరిజం స్పాట్‌లు, మల్టీప్లెక్స్‌లు, మాల్స్, మార్కెట్ల లో సందడి నెలకొంది. ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, దుర్గం చెరువు, మల్కం చెరువు, కేపిహెచ్‌బి ఐడిఎల్ లేక్, చార్మినార్, కేబుల్ బ్రిడ్జి, ఖాజాగూడ లేక్..ఇలా టూరిస్ట్ ప్లేసెస్‌లో సాయంత్రం వరకు స్టూడెంట్లు, ఫ్యామిలీల రద్దీ కనిపించింది.

**గ్రేటర్‌లోని మూడు కమిషనరేట్ల పరిధిలో పోలీసులు రాత్రి 11 గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వైన్‌షాప్‌ల వద్ద రద్దీ కారణంగా పలుచోట్ల ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రాత్రి 10 గంటల తర్వాత ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జితో పాటు గ్రేటర్‌లోని అన్ని ఫ్లైఓవర్లపై ట్రాఫిక్‌ను అనుమతించలేదు. లంగర్‌హౌస్, బేగంపేట ఫ్లై ఓవర్లపై ట్రాఫిక్‌ను అనుమతించారు. ఓఆర్ఆర్ రూట్‌లో ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారిని మాత్రమే అనుమతించారు. న్యూ ఇయర్ వేడుకల్లో ఎలాంటి ఘటనలు జరుగకుండా పోలీసులు భద్రతా చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో మొత్తం 185 స్పెషల్ టీమ్స్‌తో డ్రంకన్ డ్రైవ్ తనికీలు చేపట్టారు.**




**అర్థరాత్రి వరకు నడిచిన మెట్రో రైళ్లు..**

అర్థరాత్రి వరకు ప్రజలు న్యూఇయర్ వేడుకలకు పెద్ద ఎత్తున రోడ్లపై సందడి చేశారు. ఇందులో భాగంగానే ప్రజల సౌకర్యార్థం మెట్రో వెసులుబాటును కల్పించింది. ఆదివారం అర్థరాత్రి వరకు రైళ్లను నడిపింది. అర్థరాత్రి 12.15 గంటల వరకు మెట్రో సర్వీసులు నడిపినట్లు మెట్రో రైలు ఎండి ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు. చివరి రైలు ఆయా స్టేషన్ల నుంచి 12.15 నిమిషాలకు బయలుదేరిందని, అర్థరాత్రి 1 గంటకు ఈ రైలు గమ్యస్థానానికి చేరుకున్నాయని పేర్కొన్నారు.

## యువత కేరింతలు.. డీజే మోతలు ● డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు డ్రగ్స్ తనిఖీలు

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త : గ్రేటర్‌లోని మూడు కమిషనరేట్ల పరిధిలో పోలీసులు రాత్రి 11 గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వైన్‌షాప్‌ల వద్ద రద్దీ కారణంగా పలుచోట్ల ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రాత్రి 10 గంటల తర్వాత ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జితో పాటు గ్రేటర్‌లోని అన్ని ఫ్లైఓవర్లపై ట్రాఫిక్‌ను అనుమతించలేదు. లంగర్‌హౌస్, బేగంపేట ఫ్లై ఓవర్లపై ట్రాఫిక్‌ను అనుమతించారు. ఓఆర్ఆర్ రూట్‌లో ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారిని మాత్రమే అనుమతించారు. న్యూ ఇయర్ వేడుకల్లో ఎలాంటి ఘటనలు జరుగకుండా పోలీసులు భద్రతా చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో మొత్తం 185 స్పెషల్ టీమ్స్‌తో డ్రంకన్ డ్రైవ్ తనికీలు చేపట్టారు. న్యూ ఇయర్ వేళ నార్కొటిక్ పోలీసులు రంగంలోకి దిగాయి. అత్యాధునిక టెక్నాలజీతో డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో డ్రగ్స్ డిటెక్షన్ టెస్ట్ కిట్స్‌ను రంగంలోకి దించింది నార్కోటిక్ టీమ్. ఒక్కో కమిషనరేట్‌కు 25 చొప్పున డ్రగ్ డిటెక్షన్ పరికరాలతో తనిఖీలు నిర్వహించారు. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి సోమవారం తెల్ల వారు జామున 5 గంటల వరకు తనిఖీలు నిర్వహిం చారు. ఈవెంట్స్ ఎక్కువగా జరిగిన ఏరియాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి వెహికల్ చెకింగ్ చేశారు. అర్థరాత్రి 12 గంటలకు సిటీ సీపి శ్రీనివాస్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. సిటిజన్లకు న్యూ ఇయర్ విషెస్ తెలిపారు.

**భారీగా డ్రగ్స్ అమ్మకాలు**

న్యూఇయర్ వేడుకలకు జూబ్లీహిల్స్‌లో డ్రగ్స్ విక్రయి స్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. పంజాబ్ నుంచి తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్‌లో ప్రముఖ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు ఈ ముఠాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 100 గ్రాముల ఎండీ ఎంఏ, 29 గ్రాముల బ్రౌన్ షుగర్ ప్యాకెట్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్‌లోని లవ్లీ యూని వర్సిటీలో చదువుతున్న విద్యార్థులు సూరి లీల నవీన్, వీర సాయి తేజలు అక్కడి నుంచి డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తీసుకువ చ్చారు. అయితే పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు డ్రగ్స్ విక్రయిస్తున్న నవీన్, సాయి తేజను అరెస్టు చేశారు. వీరిద్దరూ లోన్ యాప్‌లలో భారీగా అప్పులు తీసుకున్నారు. ఈ అప్పులు తీర్చేందుకు తప్పుడు దారిని ఎంచుకున్నారు. నవీన్, సాయితేజ న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్ విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బుతో తమ అప్పులు తీర్చాలని భావించారు. అయితే వీరి ప్లాన్ అట్టర్‌ప్లాప్ అయ్యింది.



దీవాళి సమ్మేళనంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మోండా కార్పోరేటర్ కొంతం దీపిక

## దీవాళి సమ్మేళనంలో పాల్గొన్న కేంద్రమంత్రి

కంటోన్మెంట్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన దీవాళి సమ్మేళనంలో ఆదివారం సికింద్రాబాద్‌లోని గుజరాతీ హై స్కూల్‌లో నిర్వహించిన ప్రజా ప్రతి సమాజ్ వేడుకలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, రాంగోపాల్ పేట్ డివిజన్ కార్పోరేటర్ చీర సుచిత్రలు పాల్గొన్నారు.

## గ్రేటర్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



కంటోన్మెంట్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2024లోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో కోరుకున్న పనులు నెరవేరాలని, అన్ని శుభం జరుగాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతున్ని అయన కోరారు.

## జనవరి 3న నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న కృష్ణా డ్రికింగ్ వాటర్ సరఫరా మొదటి దశలో సంతోష్‌నగర్ వద్ద ఉన్న 1600 ఎంఎం డయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్‌పైప్‌లైకు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఎస్ఆర్‌డిపిలో భాగంగా నల్గొండ - ఓవైసి డౌన్ ర్యాంప్ అలైన్‌మెంట్‌లో ఉన్న సంతోస్ నగర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులకు ఇబ్బందులు కలగకుండా జంక్షన్ పనులు చేయనున్నారు. ఈ పనులు జనవరి 3వ తేది బుధవారం ఉదయం 6గంటల నుంచి మరుసటి రోజు 4వ తేది గురువారం ఉదయం 6గంటల వరకు జరుగుతాయి. ఈనేపథ్యంలో పలు రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. డివిజన్ 1 పరిధిలో మిరాలం, కిషన్‌బాగ్, ఆలుబైన్ కాలనీ, డివిజన్ 2ఏ సంతోష్‌నగర్, వినయ్‌నగర్, సైదాబాద్, చంచల్‌గూడా, ఆస్మన్‌ఘడ్, యాకత్‌పుర, మాదన్నపేట, మహబూబ్‌మాన్షన్, డివిజన్ 2బి రియాసత్‌నగర్, అలియాబాద్, డివిజన్ 4 బొగ్గుల కుంట, అఫ్జల్‌గంజ్, డివిజన్ 5 నారాయగూడ, అడిక్‌మెట్, శివం రోడ్, నల్లకుంట, చిలకలగూడ, డివిజన్ 10ఏ దిల్‌సుఖ్‌నగర్, డివిజన్ 20 బొంగుళూరు, డివిజన్ 22 పరిధిలోని మన్నెగూడలో నీటి సరఫరాలో అతరాయం ఉంటుందని అధికారులు వెల్లడించారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.

## నేడు టిటిడి శ్రీవారి దర్శనానికి ఏర్పాట్లు

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: నూతన ఆంగ్ల సంవత్స రాన్ని పురస్కరించుకుని లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల సందర్శనార్థం సిబ్బందికి ఆనేక ఏర్పాట్లు చేసింది. కొత్త సంవత్సరం జనవరి 1వ తేదీన దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి తెల్లవారు ఝామున 4 నుంచి 6 వరకు తిరుప్పవై, శుద్ధి, తోమాల సేవ, అర్చన కార్యక్రమాలు జరుగుతాయని టిటిడి డిప్యూటి ఇవో రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు శ్రీవారి సర్వసదర్శనం, 12.45 గంటల నుంచి రాత్రి వరకు సర్వదర్శనం కొనసాగుతుందన్నారు. ఆదే విధంగా జూబ్లీ హిల్స్‌లోని శ్రీవేంకటేశ్వ రస్వామి దేవాలయంలో కూడా శ్రీవారికి సేవా కార్యక్రమాలు కొనసాగుతా యని, అలాగే భక్తులకు సర్వదర్శన కార్యక్రమం ఉంటుందన్నారు. శ్రీవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు. తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందన్నారు.

## ఆటో ఢీకొని వ్యక్తి మృతి



జీడిమెట్ల, డిసెంబర్ 31, ప్రభాతవార్త : జీడిమెట్లలో విషాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ విసాదకర సంఘటన జీడిమెట్ల పరిధిలో శనివారం అర్థరాత్రి చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను దవాకనకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఎగ్జిబిషన్ ప్రారంభం

**45 రోజుల పాటు వికాసం, వినోదంతోపాటు వివిధ ఉత్పత్తుల అమ్మకాలు**

గోషామహల్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: ప్రతియేటా ఎగ్జిబిషన్ సొసైటి నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ద్వారా దేశంలోనే హైదరాబాద్ నగరానికి ఎంతో గుర్తింపు లభించింది. నాంపల్లి మైదానంలో సోమవారం ఎగ్జిబిషన్ సొసైటి ఆధ్వర్యంలో 83వ నుమాయిస్‌ను ప్రారంభించేందుకు సొసైటి ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సారి 83వ నుమాయిష్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటి ద్వారా నుమాయిస్ అంచెలం చెలుగా అభివృద్ధి చెందుతూ నేడు భారత దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న ఉత్పత్తులను అమ్మకాలు చేయడం ద్వారా సొసైటికి, హైదరాబాద్ నగరానికే గర్వకారణమన్నారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ఎంతో మంది వ్యాపారులు ఇక్కడి వస్తారు. 30వేలమంది విద్యార్థీనులకు ఈ సొసైటి ద్వారా విద్యను అందించడం జరుగుతుందన్నారు. 45 రోజుల పాటు ఉపాధి లభిస్తుందన్నారు. నుమాయిష్‌తో వచ్చే ఆదాయంతో పాఠశాల, కళాశాల విద్యసంస్థలను నడువడం గొప్ప విషయమన్నారు. 10వేలమంది సొసైటి ద్వారా ఉపాధి పొందుతున్నట్లు వివరించారు. ప్రతియేటా జనవరి మాసంలో జరిగే ఎగ్జిబిషన్ ద్వారా అన్ని కులాలు, మతాలకు చెందిన బడా వ్యాపారులను, చిరువ్యాపారుల వరకు ఉపాధి పొందుతారు. ఆర్‌టిసి కూడా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. 45 రోజుల పాటు ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. చిన్నారులు ఎంతో ఆసక్తితో తల్లిదండ్రులతో కలిసి నుమాయిష్‌ను తిలకించేందుకుగాను వస్తుంటారు. ఎగ్జిబిషన్‌లో రకరకాల వస్తువులు అందుబాటులో ఉంటాయి. కాగా చుక్‌బుక్ రైల్ ఎంతో ఆకట్టుకుంటుంది. అభివృద్ది కాకుండా వినోదం, వికాసం అందిస్తు మూడు చోట్ల డిస్‌ప్లే బోర్డు ద్వారా ఎగ్జిబిషన్‌ను తిలకించే సందర్శకుల దృశ్యాలను చూడటానికి సిద్దం చేశారు. ప్రత్యేక పోలీసు బందో బస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి లాభాపేక్షలేకుండా సొసైటికి విద్యాసంస్థలను నడుపుతున్న ఘనత ఉందన్నారు.

## నూతన సంవత్సరానికి శ్రీవారి ఆలయాలు ముస్తాబు

చిక్కడపల్లి, డిసెంబర్ 31 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వారిని 2024 నూతన సంవత్సరంను పురస్కరించుకుని దేవాలయాలను సోమవారం పెద్దసంఖ్యలో భక్తులు వచ్చేఅవకాశం ఉన్న దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ కె.రామాంజనేయులు వివరించారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున నుంచే భక్తులు వచ్చే అవకాశం ఉన్న కారణంగా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. కాగా ఆలయాన్ని విద్యుత్తుదీపాలను పెద్దఎత్తున అలంకరణలు చేశారు. కోవిడ్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.

**ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో**

ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయం ఈవో లక్ష్మారెడ్డి వివరించారు. ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు విధిగా నిర్వహిస్తామన్నారు.

**వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో**

వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మ, ఈవో మాచర్ల దేవనాథం వివరించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు.

**అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకు ప్రచార అస్త్రం :** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీలు ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రచార అస్త్రంగా వాడుకున్నారు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం వల్లే పనులు ఆలస్యం అవుతున్నాయని బిఆర్ఎస్ నేతలు ఆరోపించగా, రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని బిజెపి నేతలు విమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్, బిజెపి ఇద్దరి వల్లే పనులు సాగడం లేదని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినందున ఈ పనులను యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ పనుల కారణంగా ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాలు జరిగి 30 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ విషయంలో ఆలోచించి వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




నత్తనడకన సాగుతున్నా ఉప్పల్‌లో నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులు

## ఎలివేటెడ్ కారిడార్.. ఎప్పటికి పూర్తయ్యేనో..?

**ఉప్పల్, నారపల్లి ఆరేళ్లుగా సాగుతున్న నిర్మాణం ● ఇంకా 58 శాతం పనులు పెండింగ్**

ఉప్పల్, డిసెంబరు 31 ప్రభాతవార్త : ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయి. పనులు చేపడుతున్న కాంట్రాక్ట్ సంస్థ దివాళా తీయడంతో పనుల నిర్మాణం మరింత ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు కొత్తగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని 2018లో అప్పటి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. రామంతాపూర్ పబ్లిక్ స్కూల్ లో లాంచనంగా పనులు ప్రారంభించి రెండేళ్ల లో పూర్తి చేస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే ఈ పనులను మాజీ ఎంపికి చెందిన గాయత్రి కన్‌స్ట్రక్షన్ సంస్థ దక్కించుకుంది. సుమారు 7 కి.మీ పరిధిలో నిర్మిస్తున్న ఈ కారిడార్ పనులను సుమారు రూ.600 కోట్లతో కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ నిర్మిస్తుంది. భూసేకరణ పనులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టగా, నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం టెండర్ ద్వారా గాయత్రి సంస్థకు అప్పగించారు. అయితే ఆరేళ్లు గడిచినా పనులు నత్తనడనక సాగుతుండడంతో యాదాద్రి, వరంగల్ రహదారిలో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గాయంత్రి సంస్థ 25 శాతం తక్కువకు టెండర్లు దక్కించుకోగా, 2020 జూలై లోనే పనులు పూర్తి చేయాల్సి ఉంది. మధ్యలో గుత్తెదారు సంస్థ దివాళ తీయడంతో పనులు ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులకు కష్టాలు ప్రారంభం అయ్యాయి. ఇరుగ్గా ఉంటే ఈ రహదారిపై పిల్లర్లు మాత్రమే నిర్మించి వదిలివేశారు. కొంత దూరం వరకు మాత్రమే పైవంతెన పూర్తి చేశారు. వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణించే ఈ రహదారి విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో అధికారులు నెట్టుకుని వస్తున్నారు తప్పా పూర్తి స్థాయిలో పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో ఈ రహదారిలో ప్రయాణం అంటేనే ప్రజలు హడలిపోతున్నారు. రామంతాపూర్‌కు చెందిన గుమ్మి రాజ్‌కుమార్ అనే వ్యక్తి సమాచార చట్టం ప్రకారం పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారనే విషయాన్ని ఆరా తీయగా మరో ఏడాది వరకు ఈ తిప్పలు తప్పవని తెలిసింది.

**నత్తనడకన సాగుతున్న పనులు..**

ఉప్పల్, నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఆర్‌అండ్‌బి అధికా రులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఈ రహదారిలో దుమ్ముదూళితో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. రూ.600 కోట్లతో చేప ట్టాల్సిన పనిని సుమారు రూ.430 నుంచి 450 కోట్లతో చేస్తామని ఎల్1గా నిలిచిన గాయత్రి సంస్థ ప్రభుత్వంతో అప్పట్లో ఒప్పందం చేసుకుంది. తక్కువ రేటుకు పనులు చేపట్టడంపై అప్పట్లోనే పలు కధనాలు వినిపించాయి. ప్రస్తుతం కాంట్రాక్ట్ సంస్థ దివాళా ప్రక్రియలో ఉండడంతో నిర్మాణం ఎప్ప టికి పూర్తవుతుందనే ప్రశ్నార్థకంగా మారింది. నిర్మాణ సమయాన్ని పొడిగించేందుకు అనుమతి ఇచ్చిన పక్షంలో ఎస్బీఎల్టీ నిధుల ద్వారా నిధులు సమీకరించి పనులు పూర్తి చేస్తామంటూ సదరు సంస్థ అధికారులకు లేఖ రాసింది. ఇంకా 58 శాతం పనులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేసేందుకు ఆరు నెలలు గడువు ఇవ్వవచ్చంటూ కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వశాఖకు ఇక్కడి అధికారులు ప్రతిపాధనలు పంపారు.

ఆరేళ్లలో చేయని పనిని ఆరు నెలల్లో ఎలా పూర్తి చేస్తారో అధికారులకే తెలియాలి. అధికారుల అంచనా ప్రకారం మరో 150 నుంచి 200 కొట్ల వరకు పనులు పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. నిధులు విడుదల చేసినా పనులు చేస్తారా, లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏది ఏమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# అస్సాం సిఎం హిమాంత్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

వడ్లమూరి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: సూద్రులు, దళిత బహుజనులపై అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన అస్సాం ముఖ్యమం త్రి హిమంత్‌బిసా వ్శర్మపైన కఠినంగా చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రధాని నరేంద్రమోదీని డిమాండ్ చేశారు. ఆర్య, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్య వైశ్యలు మూడు వర్ణాలకు సేవలు చేయడానికే సూద్రులను బ్రహ్మ పుట్టించారని, సూద్రులు మూడు వర్ణాలకు బానిసలుగా ఉండాలనే సనాతన ధర్మం మార్గంలో బిజెపి సర్కార్ పనిచేస్తున్నదని ఆరోపించారు. ఆదివారం పార్టీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల విచ్ఛన్నం, కుల ద్వేషం, దురహాకారంతో రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడిన అస్సాం ముఖ్యమంత్రిపైన తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను డిమాండ్ చేశారు. సిఎం చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ, సూద్రులకు, దళిత బహుజనులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హిమంత్‌బిశ్వశర్మ ప్రకటనలకు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లోని ఎస్సీ, ఎస్టీ, బిసిలు నేతలు బయటకు వచ్చి ఇప్పటికైనా పరివర్తన చెందాలని సూచించారు. ఈ దేశ భూమిపుత్ర సామాజిక పరివర్తకులు, మహానీయులు డా.బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతి భాపూలే గౌతమబుద్ధిని మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇటీకాల గణేష్, పెండ్యాల సుచంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను
# ప్రతిఘటించేందుకు మానవ సమాజం బాసటగా నిలవాలి

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దుర్మార్గమైన మారణకాండను ప్రతిఘటించేందుకు మానవ సమాజం బాసటగా నిలవాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణలను, దమనకాండను ఖండిస్తూ పాలస్తీనాకు అండగా నిలవాలని వక్తలు కోరారు. ఆల్ ఇండియా ప్రొగ్రెసివ్ ఫోరం తెలంగాణ రాష్ట్ర సమన్వయ కమిటి ఆధ్వర్యంలో ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో పాలస్తీనా స్వేచ్ఛా కోసం గళమెత్తుదాం, వ్యాసాల సంకల్పన పుస్తకాన్ని ఎఐటియుసి మాజీ కార్యదర్శి డా.బి.వి.విజయలక్ష్మి, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, మర్ల సోమసుందర్, కవి, రచయిత స్కైబాబు, అన్వర్‌పాషా ఆవిష్కరించారు. ఎన్.వేణుగోపాల్ ప్రసంగిస్తూ పాలస్తీనాపై దుర్మార్గంగా మారణకాండా జరుపుతున్నా ప్రపంచమంతా మౌనంగా ఉండటం బాధకరంగా ఉందన్నారు. పాలస్తీనాపై ఒక జాతి చేస్తున్న హింస కాదని న్యాయా, న్యాయాల మధ్య పోరాట మని చెప్పారు. చరిత్రను తెలుసుకోవడానికి పాలస్తీనా పుస్తకంగా ఉపయోగపడుతుందన్నారు. అమెరికా పెద్దన్నల అండతోనే ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులకు, యుద్ధానికి తెగబడుతున్నదని ఆరోపించారు. స్కైబాబు మాట్లాడుతూ సోషలిజం, కమ్యూనిజం సమాజం కోసం కలలు గంటున్న క్రమంలో 21వ శతాబ్ధంలో ఇజ్రాయిల్ వేటాడుతూ, వెంటాడుతూ పాలస్తీనా ప్రజలను చంపుతున్నదని ఆరోపించారు. ఈ మారణకాండను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ సత్యప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ స భ్యుడు వి.ఎస్.బోస్ పాల్గొన్నారు.

# పవిత్రమైన ప్రజా సమాజసేవకు నిదర్శనం వైద్యులు


వైద్యశ్రీ అవార్డు గ్రహీతలతో వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, దైవజ్ఞశర్మ, మల్లికార్జునరావు, రాఘం తదితర అతిథులు

రవీంద్రభారతి, డిసెంబరు 31 ప్రభాతవార్త : సమాజంలో నివశిస్తున్న ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఆనందోత్సా హాలతో తమ జీవితాలను గడిపేందుకు వివిధ కారణాల దృష్ట్యా అనారోగ్యాలకుగురై ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న రోగులకు తమ బాధ్యతగా అద్భుత వైద్యసేవలందిస్తూ ఆరోగ్య సమాజంగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు సమాజసేవలు చేస్తున్న పవిత్రమైన వైద్యవృత్తిని సాగిస్తూ ప్రజా సమాజసేవకే అంకితమవుతున్న వైద్యల సేవలు ఎనలేనివి అనితరసాధ్యమైనవని, ఆలాంటి సేవలందిస్తున్న వైద్యుడే నారాయణుడుతో సమానమని, వారిని వైద్యశ్రీ అవార్డుతో సత్కరిస్తున్న సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.మల్లికార్జున రావును, కార్యవర్గాన్ని అభినందించారు. మెగాసిటీ నవకళావేదిక సంస్థల 24వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన వైద్యశ్రీ అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, విశిష్ట అతిథులు డా. అశిష్ చౌహాన్, కంజర్ల ఈశ్వర్‌చారి, సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు అంకెనపల్లి మల్లికార్జునరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు రాఘన, సాయినాథ్, సాయికుమార్ తదితరులతో కలిసి వైద్యరంగంలో ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్న సమాజంలోని ప్రజలకు విశిష్ట వైద్యసేవలందిస్తున్న ప్రముఖ వైద్యులు పాతికమందిని ఘనంగా సత్కరించి వైద్యశ్రీ అవార్డులను ప్రదానంచేసి శుభాభినందనలు అందజేశారు.

## సాంకేతిక రంగంపై అనేక కథనాలు


అవార్డు అందుకుంటున్న ముద్దం స్వామి

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: డిజిటల్ మీడియ జర్నలిజంలో ప్రభావితం చూపిస్తున్న స్వామి ముద్దంకు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మకమైన సైబా సౌత్ ఇండియా ఇన్‌ఫ్లుయెన్సర్స్-2023 అవార్డును అందుకున్నారు. నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన ఈ అవార్డుల కార్యక్రమంలో నిర్వాహకులు స్వామి ముద్దంకు అవార్డు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ తనకు ఈ గౌరవాన్ని అందించిన సైబా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక రంగంలో పాత్రికేయ సమగ్రత కోసం అత్యున్నత ప్రమాణాలను నిలబెట్టడానికి తన నిబద్ధతను ఈ సందర్భంగా తెలియజేశారు. డిజిటల్ మీడియా తరువాత వచ్చే మెటావర్స్ మీడియా మానవాళిపై ఏలాంటి ప్రభావం చూపనుందో ఆయన వివరించారు. మానవాళిపై ప్రభావితం చేస్తున్న సాంకేతిక రంగంపై ఆనేక కథాలు రాస్తున్నారని, మంచిని ఎలా ఉపయోగించుకోవాలో, చెడుపై ఏలా అప్రమత్తత ఉండాలో ఎప్పటికప్పుడు రాస్తూ పలు సూచనలు చేస్తున్నారని చెప్పారు. మానవతావాదిగా, దార్శనికుడిగా, పాత్రికేయుడిగా అతని బహుముఖ రచనలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు కొనియాడారు.

## అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు



అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: మాసబ్ ట్యాంకు పోచమ్మబస్తీ ప్రజలు డాక్టర్ బాబా సాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి 69వ ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా టిఎన్‌జిఒ విద్యాశాఖ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత 70 వారాలుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, భాద్యతలు నేటి యువత, యువకులు తెలుసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు రవీందర్, వెంకటేష్, జి.మహేష్ గౌడ్, ఆర్.కె.శ్రీనివాస్, వేణు, ప్రవీణ్, శ్రీహరి గౌడ్, ప్రతాప్ గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్, జబ్బార్, అబ్దుల్లా, యాదయ్య పాల్గొన్నారు.


పద్మశాలి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బండకార్తిక చంద్రారెడ్డి

## మార్కెండేయ పద్మశాలి క్యాలండర్ ఆవిష్కరణ

తార్నాక, డిసెంబర్ 31 ప్రభాతవార్త: లాలాపేట్ మార్కెండయ పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను నగర మాజీ మేయర్ బండకార్తిక చంద్రారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. తనకు ఎప్పుడు సపోర్ట్ చేస్తున్న పద్మశాలిలకు అండగా ఉంటానని చెప్పారు. తార్నాక డివిజన్ అంటే తనకు ఇంటి కంటే ఎక్కువ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేషం, పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ చైర్మన్ దోమల లక్ష్మణ్ దాస్, వైస్ చైర్మన్ ఉద్దెమర్రి దేవేందర్, ప్రధాన కార్యదర్శి తలకొక్కుల వెంకట స్వామి, కోషాదికారి కొండ్ల వెంకటేశం పద్మశాలి, సహాయ కార్యదర్శి నాగరాజు, సలహాదారులు బిల్లా యాదగిరి, రుద్రవీణ, విజయ్‌కుమార్, గుర్రం బచ్చయ్య, పాండు, అరుణ బాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

## దూసరి ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప స్వామి పూజ


నల్లకుంటలోని తన నివాసంలో అయ్యప్ప స్వామి పూజ నిర్వహిస్తున్న దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అప్పయ్యస్వామి పూజ ఘనంగా జరిగింది. ఆదివారం నల్లకుంటలోని తన నివాసంలో జరిగిన అయ్యప్ప స్వామి పడిపూజకు స్వాములు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు దూసరి వెంకట్‌గౌడ్, దూసరి మహేష్, ఎస్.లక్ష్మణ్‌గౌడ్, రాజుగురుస్వామిలు పాల్గొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా పడిపూజ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు రాజు గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారి భజనలు జరిగాయి.


అక్కృతి సుధాకర్‌ను సత్కరిస్తున్న కృష్ణమోహన్‌రావు

## సత్కరించుకోవడంలో వైవిధ్యం ఉంది

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: అత్యున్నత ప్రమాణాలతో, వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహించే సంస్థ అకృతి అని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు చెప్పారు. విభిన్న దిగ్గజ ప్రముఖులను సత్కరించిన అకృతి సుధాకర్‌ను నేడు సత్కరించుకోవడం కూడా వైవిధ్యంగా ఉందన్నారు. సుపథం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో సుధకార్‌కు జరిగిన ఆత్మీయ సత్కారంలో ఆయన ప్రసంగించారు. సమాజంలో ఎక్కడ మంచి ఉంటుందో అక్కడ గుర్తింపు వస్తుందనే సిద్ధాంతాన్ని నమ్మి అకృతి సుధాకర్ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారని ఆయన చెప్పారు. సుధాకర్‌కు జరిగిన సత్కారం మొత్తం కళారంగానికి సంబంధించిన సత్కారంగా భావిస్తున్నానని కృష్ణమోహనరావు తెలిపారు. గౌరవ అతిధిగా పాల్గొన్న టి-పిసిసి అధికార ప్రతినిధి కల్వ సుజాతగుప్తా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళలకు, కళాకారులకు ప్రాధాన్యత ఇసు_ుందన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ వాసవి కబ్ల్ స్థాపక అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్‌రావు, సుపథం అధినేత మోహన్‌కృష్ణ తదితరలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: నల్లకుంటలోని ఆర్యవైశ్య సంఘం రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం బాగ్ అంబర్‌పేటలోని ఒక హోటల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, బెజవాడ అంజన్నగుప్తా, కోశాధికారి ఉప్పల్ శ్రీనుకుమార్‌గుప్తా, లింగప్రకాష్‌గుప్తా, కె.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ రజక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కార్పోరేటర్ సాగర్‌గౌడ్ తదితరులు

## తాయిక్వాండోలో
# చిన్నారులకు, యువతీ యువలకు శిక్షణ

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: నేటి సమాజంలో జరుగుతున్న దాడులను ఎదుర్కొవడానికి, ఆత్మరక్షణ కోసం యువతీ, యువకులకు తాయిక్వాండో విద్యా (కరాటె)లో శిక్షణ ఎంతో ముఖ్యమని లీ అకాడమీ వ్యవస్థాపకుడు బొమ్మ యశ్వంత్ చెప్పారు. రాత్రివేళల్లో అమ్మాయిలు, అబ్బాయిలు ఒంటరిగా వెళుతున్న సమయంలో అకతాయిలు ఎవరూ ఎక్కడ నుంచి దాడులు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందని, వారి నుంచి రక్షించుకోవడానికి ఆత్మరక్షణకు ఈ విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆదివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విద్యను నేర్చుకునేందుకు అసక్తిగల చిన్నారులు, యువతీయువకులు అమీర్‌పేట్‌లోని ధరమ్‌కరం రోడ్డులోగల వివేకాందనంద కమ్యూనిటిహాల్‌లో లీ అకాడమీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యశ్వంత్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆనేక మెడల్స్‌ను సాధించడం జరిగిందని, అంతేకాకుండా ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారని గురువులు తెలిపారు. ఈ మెడల్స్ సాధించడం వెనుక తల్లిదండ్రులు, గురువులైన మాస్టార్ జి.ప్రభాకర్‌గౌడ్, కె.శ్రీహరి, సీనియర్ కోచ్‌ల సహాయంతో తాయిక్వాండో విద్యను అభ్యసించి, ఎంతో మందికి శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో నిలబెట్టడం జరిగిందన్నారు. ఈ విద్య ద్వారా చిన్నారుల్లో ఆత్మరక్షణ, ఫిజికల్ ఫిట్‌నెస్, మెంటల్ ఎబిలిటి పెంపొందించడం కోసం తమ అకాడమీ ద్వారా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అకాడమీలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు, మెడల్స్, ప్రసంశపత్రాలను అందజేయడం జరుతుందన్నారు.

## ప్రభుత్వ పెన్షనర్ల ఇళ్ల స్థలాలలో న్యాయం చేయాలి

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: పెన్షనర్లకు కేటాయించిన ఇళ్ళ స్థలాల పంపిణి ప్రక్రియను అడ్డుకునే కుట్రలను మానుకోవాలని, ఇళ్ళ స్థలాల పంపిణినీ విఛ్చిన్నం చేయాలనే కుట్రదారుల చర్యలను పసిగట్టి పెన్షనర్లకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఆనేక మంది ఈ కుట్రలకు వ్యతిరేకంగా గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం శౌరలింగంపల్లిలోగల గోపన్నపల్లిలోని ఉద్యోగులకు నాటి ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు కేటాయించగా కొంత మంది ఉద్యోగ సంఘ నేతల స్వార్ధపూరిత చర్యల వల్ల స్థలాలు న్యాయస్థానం వివాదంలో చిక్కుకుని పంపిణి ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. దీంతో ప్రస్తుతం భాగ్యనగర్ టిఎన్జీవో గచ్చిభౌలి హౌసింగ్ సొసైటి పాలకవర్గం ఈ స్థలాన్ని తన అధీనంలోకి తీసుకుని సర్వీస్ సీనియారిటి ప్రకారం 845 మంది సీనియర్ పెన్షనర్లను లబ్ధిదారులగా గుర్తించిందన్నారు. సోసైటితో సంబంధం లేనివారు కొంత మంది ఈ ఇళ్ళ స్థలాల పంపిణి ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పెన్షనర్ల పట్ల ప్రభుత్వం మానవతా దృక్ఫదంతో వ్యవహరించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ


ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న స్థానికులు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 31, ప్రభాతవార్త : నియోజక వర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యత కల్పిస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని రామారావు నగర్ కాలనీలో పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఎమ్మెల్యే (సిడిఎఫ్ ఫండ్) నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రామారావు నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు 10లక్షల రూపాయలు మంజూరి చేయడం జరిగిందని, భవనంను త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. కమ్యూనిటీ హాల్‌ను కాలనీ సంక్షేమం, అభివృద్ధి కోసం చక్కగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్‌లో సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్‌లు, జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనం నిర్మించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామారావు కాలనీ అధ్యక్షులు రాజు, సత్యశంకర్ జనరల్ సెక్రటరీ, లోకేస్ సెక్రటరీ, జయప్రసాద్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రావు, నాగరాజు, మహేందర్‌రెడ్డి, మహేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అయ్యప్ప నామ స్మరణతో మారుమ్రోగిన గౌలిదొడ్డి

భగవన్నామ స్మరణంతో సర్వ పాపాలు హరించబడుతాయి : నాగేష్ యాదవ్


గౌలిదొడ్డిల జరిగిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న స్వాములు, భక్తులు

నార్సింగి, డిసెంబర్ 31 ప్రభాతవార్త : భగవన్నామ స్మరణంతో సర్వ పాపాలు హరించబడుతాయని బిఆర్ఎస్ సీనియర్ నేత గొల్ల నాగేష్ యాదవ్ పేర్కొన్నారు. నార్సింగి మున్సిపల్ పరిధిలోని గౌలిదొడ్డిలో దారుగుపల్లి ప్రభాకర్ గురుస్వామి నిర్వహించిన హరిహర తనయుడు అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం భక్తులను భక్తి సాగరంలో ముంచెత్తింది. ఉదయం నుంచి రాత్రి 10.గంటల వరకు గౌలిదొడ్డి మొత్తం అయ్యప్ప నామ స్మరణంతో మారుమ్రోగిపోయింది. గోపాల్‌సింగ్, భగువాన్‌సింగ్ గురుస్వాముల చేతులపై ఈ పూజ శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్దపుల ఈశ్వర భజన మండలి చేత నిర్వహించబడ్డ భజన కార్యక్రమం ఆద్యాంతం భక్తులను అలరించింది. వందలాది మంది అయ్యప్ప మాల ధారులు, భక్తులు ఈ వేడుకలో పాల్గొని లయబద్ధంగా భజన పాటలు ఆలపిం చారు. ఈ వేడుకలో సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు గొల్ల నాగేష్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలంతో సమానంగా పరుగులు తీస్తున్న నేటి ఆధునిక కాలంలో సైతం యువతరం ఆధ్మాత్మికతకు పెద్దపీట వేస్తుండడం, అయ్యప్ప మాలలు ధరిస్తూ, కఠిన నియ మాలను పాటిస్తుండడం ఆనందంగా ఉంద న్నారు. ఆధ్యాత్మికతలో లభించే ఆనందం, సంతృప్తి అనంతమైందన్నారు. మన సనాతన ధర్మంలోని ప్రతీ ఆచారం, పర్వదినం సర్వ ప్రాణికోటికి మేలు చేసేదిగా ఉంటుందని, ఇందుకు మనం గర్వించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప స్వాములు సంతోష్, తిరుపతయ్య, అన్నదాతలు దారుగుపల్లి ప్రమీల, సత్యనారాయణ, సుధాకర్‌లతో పాటు భక్తజనం పెద్ద ఎత్తున పాల్గొని కలియుగ ప్రత్యక్ష దైవమైన అయ్యప్ప స్వామి కరుణా కటాక్షాలకు పాత్రులయ్యారు.

## బ్రహ్మానందంకు జీవితసాఫల్య పురస్కారంతో స్వర్ణకంకణం ప్రదానం

రవీంద్రభారతి, డిసెంబరు 31 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సేవాసంస్థ రాగసప్తస్వరం 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ నటుడు, హాస్యబ్రహ్మ బ్రహ్మానందంకు జీవిత సాఫల్య పురస్కారంతో స్వర్ణకంకణ ప్రదానం, అమెరికాలో స్థిరపడిన ప్రముఖ నాట్యగురువు జమైకా ట్రేడ్ కమిషనర్ వింజమూరి సుజాతకు ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు వి.ఎస్.రాజ్యలక్ష్మి మీడియా సమావేశంలో పేర్కొన్నారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఈ నెల 3 బుధవారం సాయంత్రం 5.30గంటల నుండి తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సభాధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హర్యానా రాష్ట్ర గవర్నరు బండారు దత్తాత్రేయ విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమశాఖల మంత్రి డా. ధనసరి అనుసూయ సీతక్క, పార్లమెంటు సభ్యుడు డా. కె.లక్ష్మణ్, రామకృష్ణరాజు, ఎం.మురళీమోహన్, టర్కీ కాన్సలేట్ జనరల్ ఎల్మన్ ఒకన్, ఐటో ప్రెసిడెండ్ డా. అసఫ్ ఇక్బాల్ తదితరులతో కలిసి ముందుగా ప్రముఖ నటుడు బ్రహ్మానందంను ఘనంగా జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించి స్వర్ణకంకణం ప్రదానంచేసి, అనంతరం వింజమూరి సుజాతకు ఘనంగా ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా సంస్థ సభ్యులు రాజ్యలక్ష్మి, కె.అహల్య, శ్రీదేవి, సుజాతలతో కలిసి ఆవిష్కరించి అధిక సంఖ్యలో సినీప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బస్తీలు, కాలనీలల్లో అయోధ్య శ్రీరామ పూజిత అక్షితల కళశాల వితరణ


కళశాలతో బస్తీలో పర్యటన చేస్తున్న సంయోజక్‌లు మహిళలు

హైదరాబాద్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: బస్తీలు కాలనీలల్లో అయోధ్య శ్రీరామ పూజిత అక్షితల కళశాల వితరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి రామ భక్తిని నింపేందుకు శ్రీరామ పూజిత అక్షితల కళశాల వితరణ కార్యక్రమాన్ని చేపట్టామని శ్రీరామ జన్మ భూమి తీర్థక్షేత్ర సభ్యులు మూల రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం శ్రీహనుమాన్ ఆలయం, జైస్వాల్ గార్డెన్, ఓల్డ్ జైస్వాల్ గార్డెన్, ఖాద్రి భాగ్, శంకర్‌నగర్ బస్తీలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంయెజక్‌లు, సంచాలక సమితి సభ్యులు భజన చేస్తూ ఊరేగింపుగా కలశాలతో తిరిగారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ జన్మ భూమి తీర్థక్షేత్ర సభ్యులు ఎస్.శ్రీధర్ గౌడ్, సి.శ్రీనివాస ముదిరాజ్, కర్రి రవీందర్, ప్రసన్నాంజనేయులు, వినోద్‌కుమార్, జి.వంశీకృష్ణ, ఎం.అరుణ్ కుమార్, శ్రీనివాస్, శోభ, స్వప్న, ప్రియ, నాగిని, అనిల్ చారి, జె.కె.రాయుడు, శంకర్ గౌడ్, మంజుల, సతీష్, శివకుమార్, చంద్రశేఖర్ గౌడ్, మధు గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ బిజెపి కార్యాలయంలో ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 108వ మన్‌కీ బాత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై.శ్రీ ధర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత వ్ంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాజేంద్రనగర్ ఎస్‌సి మోర్చ అధ్యక్షులు తొండుపల్లి మల్లేష్, బిజెపి నాయకులు ఎం.భాస్కర్ యాదవ్, కె.నర్సింహ, వై.హరగోపాల్, కె.లక్ష్మీ నారాయణ, ఎ.జ్ఞానేశ్వర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 31, ప్రభాతవార్త : ప్రజల మధ్యలో ఉండి ప్రజాసేవ చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాలని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబును కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు దాదాపు 200మందితో మర్యాదపూర్వకంగా రాష్ట్ర సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్నికలలో ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేరుస్తా : ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** తనపై నమ్మకం ఉంచి భారీ మెజార్టీతో గెలిపించిన మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటు ఇచ్చిన హామీలను అమలు చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం సరూర్‌నగర్ డివిజన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సరూర్ నగర్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనిత దయాకర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ సరూర్‌గర్ డివిజన్ నుండి తన గెలుపు కోసం అత్యధిక మెజార్టీని ఇచ్చిన డివిజన్ ప్రజలను ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటానన్నారు. నియోజకవర్గంలో మాజీ సిఎం కేసీఆర్ సహకారంతో చేసిన అభివృద్ధి పనులే మెజార్టీ రావడానికి కారణమైందన్నారు. డివిజన్లోని ప్రజా సమస్యలపై అవసరం అనుకుంటే అసెంబ్లీలో కూడా చర్చిస్తానని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యకర్తలకు ప్రజలకు ఏ ఆపద వచ్చినా ముందుండి పోరాడుతానన్నారు. నియోజకవర్గంలో ఎంతో కష్టపడి ఫార్మాసిటీ తీసుకొని వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కారణాలు చూపకుండా రద్దు చేసిందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి అనేక ప్రాజెక్టులను నియోజకవర్గంలో తీసుకొచ్చానని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, అంకిరెడ్డి పాల్గొన్నారు.

## గవర్నర్ తమిళసై ని కలిసిన సాయిబాబా పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ



గవర్నర్‌ను సన్మానించి ఆహ్వానిస్తున్న గోపాలకృష్ణానంద స్వామీజీ

**సరూర్‌నగర్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన శ్రీ దత్త సిద్ధాంత ఆదికర్త, మీర్ పేట్ ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ సాయిబాబా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసైకి ఆశీర్వచనం చేశారు. ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆదివారం ఆయన తమిళనాడు రాష్ట్ర బిజెపి ఇంఛార్జి, జాతీయ బిజెపి కోర్ కమిటీ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి రాజ్‌భవన్‌లో తరలివెళ్ళి అక్కడ గవర్నర్‌ను సన్మానించి ఆశీర్వదించారు. అనంతరం ఆధ్యాత్మిక సేవలందిస్తూ మానవులను సన్మార్గంలో నడిపించే ప్రయత్నం చేస్తున్న తన పీఠాన్ని సందర్శించాలని స్వామీజీ గవర్నర్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బాబా పీఠానికి చెందిన మల్లాది లలిత్ సాయికుమార్ పాల్గొన్నారు.

### సీతారామ భక్తాంజనేయ ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

**సరూర్‌నగర్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలోని శ్రీ విష్వక్సేన గణపతి సహిత శ్రీ సీతారామ భక్తాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కందాడి శ్రీరాంరెడ్డి కమిటీ కార్యవర్గం, గ్రామస్తులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మన్నెం బుచ్చిరెడ్డి, కళ్లెం నర్సింహారెడ్డి, యెల్చల భాస్కర్‌రెడ్డి, ముద్దం వెంకట్‌రెడ్డి, యెలకొండ శ్రీధర్‌రెడ్డి, యెల్చల దయాకర్‌రెడ్డి, తర్రె అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దిల్‌సుక్‌నగర్ అవంతి కళాశాలలో ఘనంగా సాంప్రదాయ దినోత్సవ వేడుకలు



సాంప్రదాయ దుస్తులు, వివిధ వేషధారణలతో కళాశాల విద్యార్థులు

**మలక్‌పేట, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** దిల్‌సుక్‌నగర్‌లోని అవంతి పిజి కళాశాలలో పరంపర పేరుతో సాంప్రదాయ దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి వోక్సెన్ యూనివర్సిటీ ఎజిఎం సరిత తాళ్లపల్లి, ప్రిన్సిపల్ అప్పారావులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంవల్ల దేశ సంస్కృతి, సాంప్రదాయాల ఔన్నత్యంగురించి విద్యార్థులకు తెలుస్తుందన్నారు. చదువుతోపాటు అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వివిధ వేషధారణలతోపాటు సాంప్రదాయ దుస్తులు ధరించి వాటి విశిష్టతగురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎ.ఓ మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బచ్‌పన్‌లో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు



విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రశంసిస్తున్న బచ్‌పన్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

**వనస్థలిపురం, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** వనస్థలిపురం బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ విజ్ఞాన ప్రదర్శన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిలుగా బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ రీజినల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కల్పవల్లి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన నమూనాలను ప్రదర్శించి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల సృజనాత్మకతను, విషయ పరిజ్ఞానాన్ని, మేధా సంపత్తిని ఇనుమడింప చేస్తాయని తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించే విధంగా విద్యా బోధన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తమ ప్రతిభా పాటవాలను చూపించిన విద్యార్థులను విద్యా సంస్థల డైరెక్టర్ ప్రశంసించారు. విద్యార్థులకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను, అడ్మిన్ బృందాన్ని, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

## ఘనంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ



మండపంలో స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి ఇతర నాయకులు

**తుర్కయంజాల్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ 24 వ వార్డు వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిక ధనరాజ్ గౌడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మల్‌రెడ్డి రామిరెడ్డి, టిపిసిసి సభ్యులు కాకుమను సునీల్, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్‌లతో కలిసి పాల్గొన్నారు. వందలాది మంది స్వాములు పూజలో పాల్గొని అయ్యప్ప పాటలు పాడి భజనలతో అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. అనంతరం అయ్యప్పలకు అన్నప్రసాదం వడ్డించి స్వాములను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్‌రెడ్డి యాదిరెడ్డి, కౌన్సిలర్ మేతరి అనురాధ దర్శన్, భవానిరెడ్డి, అయ్యప్పస్వామి యస్వంత్‌తో పాటు పలువురు అయ్యప్పలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రభుత్వ హోమియోపతి కళాశాల వార్షికోత్సవ వేడుకలు



హోమియోపతి కళాశాల వైద్య విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న కార్పొరేటర్ చేతన, ప్రిన్సిపల్ డా.లింగరాజు తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల 56వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్కర్స్-23 పేరుతో నిర్వహించిన ఈ వేడుకలను సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అయూష్ అధనపు డైరెక్టర్ డా.లింగరాజు, వైస్ ప్రిన్సిపల్ డా.శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ కక్కిరేణి చేతన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు మరింత ఉన్నతంగా రాణించాలని సూచించారు. వైద్య పట్టా అందుకున్న విద్యార్థులు పేద ప్రజలకు తమ వంతు సేవలు అందించాలని సూచించారు. ప్రజల కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి కృషి : గీత



క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న క్రిస్మస్ కానుకలను క్రిస్టియన్ మహిళలకు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా క్రిస్టియన్ మైనార్టీలకు తగు చేయూత అందిస్తుందని, వీటిని ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ఉప్పల్ భగాయత్‌లో క్రిస్టియన్ స్మశానవాటిక ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్ గోన ఫిలిప్, జేరుసేలం మత్తయ్య, చర్చి సభ్యులు జగన్నాద్, జగన్, జోసెపిన్, జాను తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : నియోజకవర్గ ఇంఛార్జి షేక్ అక్బర్



యాంటీ డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న షేక్ అక్బర్, సోహైల్ తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి షేక్ అక్బర్ పేర్కొన్నారు. ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై యాంటీ డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్‌ను ఉక్కుపాదంతో అణిచివేయడానికి కృషి చేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత తెలంగాణాను తీర్చిదిద్దాలని సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రతి ఒక్కరూ ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. వారి ఆశాయాలకు అనుగుణంగా ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పని చేస్తున్నారన్నారు. డ్రగ్స్‌పై జరిగే యుద్ధంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ సొహైల్‌ఉద్దీన్, ముజామిల్, వరుణ్, అమేర్, మాలిక్. ముజీబ్, సైఫ్, జొహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ మత్స్యావతార వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.3.42,170

**సరూర్‌నగర్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** జిల్లెలగూడలోని చారిత్రక శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గత రెండు నెలలకు సంబంధించిన హుండీఆదాయం రూ.3.42 లక్షలు వచ్చింది. స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, పోరెడ్డి జంగారెడ్డి, చింతపట్ల జ్ఞానేశ్వరచారిల సమక్షంలో ఇఓ శ్రీనివాస్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ప్రతీత్‌ల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కించారు. గత అక్టోబర్ 31వ తేదీ నుండి ఈ నెల డిసెంబర్ 29వ వరకు వచ్చిన హుండీ మొత్తాన్ని లెక్కించగా ఆదాయం రూ.3,42,170 వచ్చింది. ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని ఆలయ ఇఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కృషి : ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం హబ్సిగూడ జై సంతోషినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితోపాటు, సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సలహాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయని, వారికి అన్నివిధాలుగా చేయూత అందిస్తామన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా భాష్యం వార్షికోత్సవ వేడుకలు




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కల్నల్ లంక శ్రీనివాస్, అంకమ్మరావు తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** దిల్‌సుక్‌నగర్ భాష్యం పాఠశాల 11వ వార్షికోత్సవవేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కల్నల్ లంక శ్రీనివాస్ భాష్యం పాఠశాల జోనల్ ఇంఛార్జి అంకమ్మరావు, ప్రిన్సిపల్ పల్లవిరెడ్డి, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సి పల్ భానుమతిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి దేశానికి తమ వంతు సేవ చేయాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా తమ ప్రతిభను కనబర్చాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన జానపద, సాంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదే విధంగా మెజీషియన్ రామ్‌అనిల్ ప్రదర్శించిన అంశాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : చిలుక



దరఖాస్తు పరిశీలిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్కె పురం డివిజన్ శ్రీ కృష్ణ నగర్ కమ్యూనిటీ హాల్ వార్డ్ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలనలో భాగంగా అభయ హస్తం ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తులను రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి దరఖాస్తూ ఫారాల్లో వివరాలను నింపి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సకల జన హితం, ప్రగతి పథం, ప్రజా ప్రభుత్వమని, ప్రజలు ప్రభుత్వం ఏర్పడిన నెలలోపు 6 గ్యారెంటీల అమలుకు కార్యాచణ చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు తలాటి రమేష్ నేత, నగేష్, డివిజన్ మహిళ అధ్యక్షురాలు చిలుకూరి లక్ష్మీ, రేణుక, పాండుతదితరులు పాల్గొన్నారు.

## బి.యన్.రెడ్డినగర్‌లో స్వచ్ఛభారత్ : లచ్చిరెడ్డి




స్వచ్ఛభారత్ కార్యరక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ పాపిరెడ్డి కాలనీలో నిర్వహించిన స్వచ్ఛభారత్ పాపిరెడ్డి కాలనీ కార్యక్రమంలో బి.యన్.రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్వచ్ భారత్ కార్యక్రమంకాలనీలో ప్రారంభించడం సంతోషంగా ఉందని స్వచ్ భారత్‌లో భాగంగా చెత్తరహిత, పరిశుభ్ర డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకారం ఉండాలన్నారు ప్రతి కాలనీలో ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకరయ్యగౌడ్, డివిజన్ ఉపాధ్యక్షులు మెట్టుపల్లి సంతోష్ రెడ్డి, నాయకులు శ్రవణ్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు శ్రీశైలం, ఉపాధ్యక్షులు బాలునాయక్, జనరల్ సెక్రెటరీ రవి నాయక్, సాంబయ్య, సోమయ్యగౌడ్, ఆలయ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, వేంకటేశ్వరరావు, రాఘవేంద్ర, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నాదర్‌గుల్‌లో జరిగిన అయ్యప్ప స్వామి మహా పడి పూజలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్: చిత్రంలో మహా గురుస్వామి పాలుబాయి అశోక్, భాగ్యనగర్ సొసైటీ వైస్ చైర్మన్ బంగారి బాబు తదితరులు ఉన్నారు. (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

## మినీ శిల్పారామంలో నాట్య ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మీరా నాట్య నిలయం గీత పూజిత శిష్యబృందం ఆధ్వర్యంలో భరతనాట్య నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మూషిక వాహన, అష్టలక్ష్మి, నొత్తుశ్వర, తిస్ర అలరింపు, రంగపూజ, మహాలక్ష్మి, అష్టకం, స్వరజతి, అనంద నర్తన, గణపతిమ్, కృష్ణ శబ్దం, గణేశా పశ్చారత్నం, ముద్దుగారే యశోధ, అంశాలను పూజిత, హర్షిత, సురాధ్య, దీమహి, నిహిత, తనస్వి, జీనీషా, వివాంగా, నేత్ర తదితరులు తమ ప్రదర్శనలో మెప్పించారు. ఆదివారం సెలవుదినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## రాఘవనగర్‌లో మాత జాగరణ్.. హాజరైన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మాత జాగరణ్‌కు హాజరైన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని రాఘవనగర్‌లో మాత జాగరణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేగా సబితాఇంద్రారెడ్డి విజయం సాధించిన సందర్భంగా మాచర్ల అవినాశ్ అనే భక్తుడు మాత జాగరణ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సబితారెడ్డి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, స్థానిక కాలనీవాసులు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులు : బద్దం



సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** గడ్డిఅన్నారం డివిజన్ లోని శ్రీ కోదండరాం నగర్ కాలనీలో సిసి రోడ్డు పనులకు జి.హెచ్.ఎం.సి ద్వారా మంజూరైన నిధులు సుమారు రూ.25 లక్షలతో జిహెచ్ఎంసి అధికారులతో స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాలతో పనులు చేపట్టాలని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. డివిజన్ పరిధిలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. గడ్డిఅన్నారం డివిజన్‌ను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్, విజయ్, శ్రీశైలం, శ్రవణ్ గౌడ్, పద్మ గౌడ్, కళావతి, సంధ్య, నాని తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌కు చేరుకున్న అయోధ్య రాముడి పట్టాభిషేక మహోత్సవ అక్షింతలు

**ఉప్పల్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** అయోధ్యలోని రామయ్య పట్టాభిషేక మహోత్సవంలో ఉపయోగించే శ్రీరాముడి అక్షింతలు ఉప్పల్‌కు చేరుకున్నాయి. అయోధ్యలోని రామాలయం నిర్మాణం శ్రీకారం చుట్టి కొద్ది రోజుల క్రితమే పూర్తి చేశారు. ప్రధాని మోడీ సహకారంతో అయోధ్య రాముడి అక్షింతలు ప్రతి గ్రామానికి చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇదే క్రమంలో శనివారం ఉప్పల్ రామాలయానికి అక్షింతలు చేరుకుని అక్కడి నుంచి ఉప్పల్ పుర వీధులలో ఊరేగించారు. ఈ అక్షితలను భక్తులు పూజగదిలో భద్రపర్చి అయోధ్యలో రామ మందిరం ప్రాణప్రతిష్ట రోజున కుటుంబ పెద్దల నుంచి ఆశీర్వాదం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గొరిగె కృష్ణ, శామీర్‌పేట ధర్మారెడ్డి, డా.శిల్పారెడ్డి, రావుల బాలకృష్ణగౌడ్, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, యు.బి.చారి, జి.శ్రీనివాసాశర్మ, ఏసూరి యాదగిరి, బజారు జగన్‌గౌడ్, మేకల సంతోష్ రెడ్డి, బోరంపేట కృష్ణ, మందముల అంజిరెడ్డి పలువురు కాలనీ నేతలు, భక్తులు పాల్గొన్నారు.

## వంజరి సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షులు నరేందర్ తదితరులు

**తార్నాక, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** తార్నాకలోని తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం వంజరి సంఘం ఆద్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశంతో పాటు పలువురు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంజరి సంఘం నిరంతరం వంజరి కులస్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోషాదికారి కాలేరు అమరేందర్, ముఖ్యలసహాదారులు సాల్వేరు ముత్తయ్య, సలహాదారులు సురేందర్, రామోజీ, ఆంజనేయులు, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, విశ్వనాథం, కరిపె ప్రవీణ్, వంజరి అమర్,ప్రవీణ్ వంజరి, అమర్ తధితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయి : న్యాయమూర్తి సురేందర్

**హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** క్రీడలు మానసిక ఉల్లోసానికి దోహదపడతాయని న్యాయమూర్తి సురేందర్ రాష్ట్ర పర్యటకశాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. నాగోల్ న్యూ నాగోల్‌లోని ఆర్ త్రీ బ్యాడ్మింటన్ స్టేడియంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2023ని హైకోర్టు జడ్జి సురేందర్ తో కలిసి ఉప్పల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో 100 మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. 30 ప్లస్, 35 ప్లస్, 40 ప్లస్, 45 ప్లస్, 50 ప్లస్ ఏజ్ లిమిట్ తో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామం తప్పనిసరి అని, గెలుపు ఓటములు ముఖ్యం కాదని టోర్నమెంట్లో ఆడడమే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్, నిర్వాహకులు రఘు, రాఘవేందర్, రమేష్, వెంకటేష్‌గుప్తా, మోహన్, సాయిరెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.